# దర్గామిట్ట కతలు

## ముక్కాలులోనే వుంది మజా అనే 'సున్తీ' కత!

మా బందువుల ఇళ్లల్లో ఏ పిల్లోడికైనా "ఖత్నా" (సున్తీ) చేస్తా ఉండారని తెలిసిందంటే చాలు మా నాయిన గుండెల్లో దభీమని రాయి పడుతుంది.

ఈ సంగతి మాఅన్నకి తెలీకుండా దాచిపెట్టడం ఎట్టారా అని ఆయన కిందా మీదా పడతా ఉంటాడు. కానీ మా బందువుల ఇళ్లల్లో "ఖత్నా" అంటే మాకు పిలుపులు వస్తాయి కదా. పిలుపులొచ్చినాయంటే మేమందరం పలావు బోజనాలకి ఎళ్లాలి కదా. అవ్వుడు నచ్చినట్టుగా మా అన్నకు ఖత్నా సంగతి తెలిసిపోయేది.

యింక చూడాలి మా అన్న చేతిలో మా నాయిన అగచాట్లు.

"నాయినో... ఎవ్వుడు నాయినా మాక్కూడా ఖత్నా చేయించేది? చెప్ప నాయిన. ఎవ్వుడు నాయిన?" అని, నలుగురుండారని కూడా చూడకుండా మా అన్న మా నాయిన ఎమ్మటపడి పెరక్కతినేసే వాడు.

మా నాయిన తత్తర బిత్తరయిపోయే వాడు మా అన్న దెబ్బకి.

"చేయిస్తా లేరా. వచ్చే నెల్లో చేయిస్తా. నువ్వు పా" అని, మా అన్నని అణ్ణే ఉంచకుండా చెయ్యి పట్టుకుని ఖత్నా యింట్లో నుంచి బయటకు పిలచకొచ్చేసే వాడు.

పాపం, అవ్వుడు మా నాయిన మొకం అవమాన బారంతో వల్లంగ అయిపోయేది.


మాఅన్నకు ఎవ్వుడు చూసినా ఎవ్వడెవ్వుడు "ఖత్నా" చేస్తారా అని ఆరాటంగా ఉండేది. ఎందుకంటే ఖత్నాకు ఎట్ట లేదన్నా ఒక జతయినా కొత్త గుడ్డలు కుట్టిస్తారు. కొత్త స్లిప్పర్లు కూడా యిప్పిస్తారు. కావాలంటే లెదరు చెప్పులను డిమాండు చేయవచ్చు. యింక, రేపు పొద్దున ఖత్నా అనంగా యియ్యాల రాత్రికి పలావొండి కార్యం జేసి, పూలతో అలంకరించి, పెళ్లి కొడుకుల ముస్తాబు చేస్తారు. అనేక అమ్మలక్కలంతా గందం పూసి, పటపటమని వేళ్లు యిరిగేలా మొటికలు యిరిచి చేతిలో సదివింపుల డబ్బులు పెడతారు... మేనత్తలు గుడ్డలు కూడా పెడతారు. .. కాబట్టి ఖత్నా చేయించుకొని అవన్నీ అనుబవించాలని మా అన్నకు బలే ఆశ.

(నాకు మాత్రం అంత ఆశ లేదు సామీ. ఖత్నా వల్ల రక్తం పోయి పిలకాయలు బలహీనపడుంటారని చెప్పి దగ్గిరి బందువులంతా రోజుకొకరు లెక్కన కోడి కూర, ఎముకల షేర్వా పంపిస్తారు గదా... వాటి సంగతి చూసుకుందాములే అనుకుంటా వుండేవాణ్ణి).

అయితే మా అన్న కొత్త గుడ్డల ఆశ గానీ, నా కోడి కూర ఆశ గానీ తీర్చడానికి మా నాయిన కాడ 'దుడ్డు యిల్లే.'

"ముగ్గురికీ కలిపి ( మా అన్నకు, నాకు, మా తమ్ముడికి) ఒకేసారి గనంగా చేద్దాము. డబ్బులు రానీయండి" అంటా ఉండేవాడు మా నాయిన. అయితే అది ఎంత గనమో, అయి ఏమి డబ్బులో మాత్రం చెప్పేవాడు కాదు.

మా నాయినమ్మ చూసిందీ, చూసిందీ యింక లాబం లేదనుకొని ఒకరోజు అగ్గిబరాటా అయిపోయింది.




'రే అబయా. నాకు తెలియక అడగతా... యింకెవ్వుడు నువు పిలకాయలకు ఖత్నా చేయించేది? మీసాలు గెడ్డాలు మొలిచేశాకనా? యిప్పటికే పెద్దోడికి పద్నాలుగు నిండిపోబోతా ఉన్నాయి. పదిహేను గాని వచ్చినాయంటే మంగలోని ముందు పరువు దక్కదురా తండ్రీ" అని మా నాయిన్న తీవ్రంగా ఎచ్చరించింది.

(యీడ మా అన్నకు పద్నాలుగంటే నాకు పదకొండు అని అర్దం. మా యిద్దరికీ మూడేళ్లు ఎడం. మా "ఖత్నా" అవ్వుడు నేను ఆరో కిలాస్‌లో ఉంటే మా తమ్ముడు యూకేజీలో ఉన్నాడు).

యింక ఏమనుకున్నాడో ఏమో దెబ్బకు ఖత్నా ముహూర్తం పెట్టించేశాడు మా నాయిన.

పిలకాయలకు చేస్తున్న తొలి కార్యం గదా బాగా చేద్దాము, సంతోషంగా చేద్దాము అని పాపం మా అమ్మా - నాయినా అనుకుంటా ఉంటే ఆదిలోనే అలక పాన్పులు షురూ అయిపోయినాయి.

"నీ బార్య మా యింటికొచ్చి 'రెండు రోజుల ముందే రండమ్మా అనకుండా కార్యానికి రండమ్మా' అని పిలిచిందిరా. నేను రాను" అని, మా నాయినతో తకరారుకు దిగి అలిగి కూచునింది మా చినత్త.

"నా బర్తను పిలవడానికి నీ బార్య ఎవత్తిరా? ఏమి? నువ్వొచ్చి పిలవ లేవా? నేనూ నా బర్త అంత చులకనగా ఉండామా మీ కళ్లకి?' అని, పేచీ పెట్టింది మా రొండో అత్త.

పాపం మా పెదత్తకు ( మా నాయినకు ముగ్గురు అక్క చెల్లెళ్లు) ఏ పాపమూ తెలియదు. యీళ్లిద్దరూ కలిసి ఆమెను కూడా రెచ్చగొట్టి

వదిలి పెట్టినారు.

మా నాయిన ఎట్నో బతిమిలాడుకొని వాళ్ల ముగ్గుర్నీ కార్యానికి పిలచకొస్తే... ఆహా... చేసినారు యాక్షనూ...

ఒక్కరూ మమ్మల్ని దగ్గరికి తీసుకోలా. నోరు దెరిచి చల్లంగా ఆశీర్వదించలా. పైగా నదివింపుల కోసరం కాచుకోమన్న మా అన్న నోట్లో మట్టి కొట్టినారు.

ఎట్టా కొత్త గుడ్డలు తేలేదు, వంద నోట్లన్నా ఇస్తారు గదా అనుకుంటా ఉండివాడు మా అన్న.

లా. యాభై. యాభై. యాభై... అంతే.

"కూడబలుక్కొని ఇచ్చారమ్మో నా బిడ్డలకి ముగ్గురు మేనత్తలూ మూడు యాభైలు. యీళ్ల యాభైలు నల్లంగుండ' అని, కడుపుమంట దాచుకోలేక పైకి అనేసింది మా అమ్మ– నదివింపుల్ని చూసి.

మా అమ్మ కోపం చూసి, "పోనీ... పోనీ..." అని సర్దతా ఉండివాడు మా నాయిన – గొడవ కాకుండా.

కార్యం పూర్తయ్యింది. అందరూ పలావులు తిన్నారు.

తెల్లారితే ఖత్నా.

తెల్లారింది. మంగలాయిన వచ్చినాడు. మా ముగ్గురికీ ఎర్ర పంచె, పొసువు చొక్కా తొడిగినారు. కొత్త కుండ తెచ్చి బోర్లించినారు. యింక దాని మీద కూచొని ఒకోకరం ఖత్నా చేయించుకోవాలి. అప్పుడు మొదలయ్యింది మా అమ్మా, నాయినమ్మల ఏడుపు.

"ఏం కాదులే నాయినలారా. సంబాళించుకోండి" అంటా మాకు ధైర్యం చెప్పబోయి మా కంటే ముందర ఏడుపు మొదలెట్టేసినారు.

వాళ్ల ఏడుపుకు మా తమ్ముడు దడుసుకొని వాడు కూడా ఏడవడం మొదలు బెట్టినాడు.

"యిట్టా ఏడ్చినారంటే నా పని అయినట్టే" అని, మంగలాయిన గమ్మున కూచున్నాడు కత్తి పట్టుకొని.

మా నాయిన, యింకొంతమంది మొగోళ్లు కలిసి ఆడోళ్లని అదిలించి కంట్రోలు చేసినాక గానీ ఏడుపులు సద్దుమణగలేదు.

పస్టు మా అన్న కూచున్నాడు కుండమీద.

"పైకి చూడు... పైకి చూడు..." అని, మా అన్నను సీలింగు తట్టు చూడనిస్తా, సున్నవు గుర్తు పెట్టుకొని ఒక్క సెకనుతో కత్తి తిప్పినాడు మంగలాయిన. అంతే. ఖత్నా అయిపోయింది.

కట్టు గడుతున్నంత సేపు మాత్రం మా అన్న "నొప్పి నొప్పి" అని తవకలాడతా ఉన్నాడు.

మళ్లా నేను.

మంగలాయన కత్తి తిప్పంగానే మసుకుని చెం దక్కడ.



యింక నేను "అమ్మో... నాయినో..." అనబోతా ఉన్నానని తెలిసి, ఎవరో లటక్కన నా చేతిలో అయిదు రూపాయిల నోటు ఉంచారు. అంతే. కంట్రోల్ అయిపోయినాను.

అందరికంటే సుకమైన పని మా తమ్ముడిదే.

వాడి రెండు చేతుల్లో రెండు లడ్లు పెట్టి కూచోబెట్టినాడు మా నాయిన. వాడు లడ్లని చూసుకుంటా కొరుక్కుంటా ఉండగానే కింద పని కిందే అయిపోయింది.

ఖత్నా అయిన వారం రోజుల్లో మా అమ్మమ్మ రెండు సార్లు కోడి కూర పంపించింది. మా పెదమ్మ ఒకసారి తలకాయ కూర పంపించింది. మా జరీనాంటి గారెలు పెట్టి, సున్నుండలు తెచ్చిచ్చింది.

అన్ని తిన్నా మా కట్లు ఇంకా ఆరలేదు. చెడ్డీ వేసుకోవడం అసాధ్యంగా అనిపించింది.

అయినా ఎనిమిదో రోజు బలే బోరుగా ఉండాదని చెప్పి లుంగీ కట్టుకునే మా యిద్యానికేతన్‌కు ఎల్లినాను.

అడుగు పెట్టడమే కర్మ మా కిలాసులోని సాకలోళ్ల పద్ద (పద్మ) కనిపించి "ఏం బాయ్. నీకు ఒడుగులు చేసినారంట్నే" అనింది. (రొంత కూడా సిగ్గు లాకుండా).

"ఆ...ఆ" అని యింకో అమ్మాయి అడక్కముందరే కిలాసులోకి చాటుగా ఎల్లి కూచునేసినాను.

ఒక తట్టు మాల్యాద్రయివోరు పాఠం చెప్తా ఉంటే యింకో తట్టు నా పక్కన కూచున్న నాయాళ్లు గుసగుసగా కొసెన్లు మొదలు బెట్టినారు.

"ఎంతరా?" అన్నారు.

"ఏంది?" అన్నాను.

"కటింగు" అన్నారు.

"కొంచిమే" అన్నాను.

"అఫా? ఫుల్లా" అడిగినాడొకడు నవ్వతా.

"కొంచిమేర్రా. చివ్వరుంటుల్లా ఆ కొంచిం తీసేస్తారన్నమాట" అన్నాను.

"అంటే నువ్విప్పుడు ముక్కాలోడివా?"

ఎవడో నన్ను ఏడ్పించడానికి పెట్టుకున్నాడు. (ముక్కాలు అంటే ముప్పావు).

నాకు సిగ్గు సిగ్గుగా అనిపించింది ఆ మాటలకి. బుగ్గలు ఎర్రంగా అయిపోయినాయి.

కిలాస్ అయిపోంగానే ఏడ్చుకుంటా వచ్చి పుస్తకాల సంచి యిసిరి కొట్టినాను.

"ఏందిరా నాయినా?" అంటా వచ్చింది మా నాయినమ్మ గాబరాగా.

"మా యిస్కూల్లో ఎక్కిరిస్తా ఉండారు. నేను ముక్కాలోణ్ణంట" అన్నాను.

మా నాయినమ్మ పకపకా నవ్వి దగ్గరికి తీసుకొనింది నన్ను.

"ఓరి పిచ్చినాయినా! నిన్ను అనిన ఆ ఎర్రోడితో ఈసారి చెప్పు, అట్టా పావు కటింగు చేసుకుంటే చాలా మంచిదీ... ముక్కాలులోనే ఉంటుందిరా మజా అని చెప్పు" అనింది నాతో.

"ఏం మజా మా" అనినాను నేను డౌటుగా.

"అది నువు పెద్దయినాక తెలుస్తుందిలే." అని అణ్ణుంచి వెళ్లి పోయింది మా నాయినమ్మ.

అది ఏం మజానో. ఏమో! ఎట్టా తెలిసేది?

—మహమ్మద్ ఖదీర్ బాబు